కొనుగోలు కేంద్రాల్లో రైతన్న అరిగోస

- మిల్లర్ల కొర్రీలతో ప్రారంభంకాని కొనుగోళ్లు
- అన్నదాతను నిండా ముంచిన వానలు
- తడిసిన ధాన్యంతో నిరీక్షిస్తున్న వైనం
- కొనుగోళ్లు త్వరగా ప్రారంభించాలని కర్షకుల వేడుకోలు


కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం

వెల్గటూర్: అకాల వర్షాలకు రైతులు ఆగమవుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి చెడగొట్టు వానలు రైతుల కష్టాన్ని నీటిపాలు చేస్తున్నాయి. వేల ఎకరాల్లో మామిడితోటలు, వరి, నువ్వులు, మొక్కజొన్న వేసిన రైతులు రోడ్డున పడ్డారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నీరు నిలిచి ధాన్యం మొత్తం నీట మునిగింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

వేల ఎకరాల్లో పంట నష్టం..

పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలతో జిల్లావ్యాప్తంగా వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, మామిడి, నువ్వ పంటలు నాశనమయ్యాయి. మామిడి తోటల్లో కాయలు రాలడంతో ఎటువంటి పరిహారం ఉండదని, కొమ్మలు విరగడం చెట్లు విరగడం లాంటివి జరిగితేనే పరిహారం ఇస్తారని నిబంధనలు చెప్తున్నాయని అధికారులు అంటున్నారు. చేతికొచ్చిన వరి నేలవాలింది. ఇప్పటివరకు పంట నష్టంపై ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎటువంటి ప్రకటన చేయకపోవడం విశేషం.

ప్రారంభంకాని ధాన్యం కొనుగోళ్లు..

పంటకోతలు ప్రారంభమై 20రోజులు గడిచినా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల ద్వారా వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి అట్టహాసంగా కేంద్రాలు ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తీసుకొచ్చి 20రోజులు గడిచినా ఇప్పటివరకు తూకం వేయడం ప్రారంభంకాలేదు. సీజన్ ప్రారంభానికి నెలముందే ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో కేంద్రాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉండగా సెంటర్లు ప్రారంభించి 20రోజులు గడిచినా మిల్లులు అలాట్ కాకపోవడం, రెండురోజుల కింద మిల్లులు కేటాయించినా కొనుగోళ్లు ప్రారంభించలేదు. అలాగే మిల్లర్ల వద్ద హమాలీల కొరత ఉందని ఇప్పుడే ధాన్యం కొనుగోలు ప్రారంభించొద్దని మిల్లర్లు చెప్పడంతో కొనుగోళ్లు ప్రారంభంకాలేదని, సమయానికి కొనుగోల్లు ప్రారంభిస్తే ఇంత నష్టం ఉండేది కాదని రైతులు వాపోతున్నారు.

ఇరవై రోజులుగా నిరీక్షిస్తున్నా..



కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి ఇరవై రోజులు గడిచినా ఇప్పటికీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు. నాలుగురోజుల క్రితం కేంద్రం ప్రారంభించినా కొనుగోళ్లు ప్రారంభించలేదు. అకాల వర్షాలు వచ్చి ధాన్యం నీటమునిగినా ఏ నాయకులు, అధికారులు వచ్చి కనీసం పలకరించలేదు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– బరుపటి మహేశ్, రైతు, పాశిగామ

మళ్లీ తూర్పార బట్టాలట



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉన్న వడ్లను కూడా కచ్చితంగా మళ్లీ తూర్పార బట్టాలట. లేకపోతే తప్ప, తాలు పేరిట తరుగు తీస్తారని నిర్వాహకులు చెప్తున్నారు. 15 రోజుల నుంచి నిరీక్షిస్తున్నప్పటికీ తూకం వేయడం లేదు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాం.

– పూదరి రమేశ్, కిషన్‌రావుపేట, రైతు

వడ్లు మొత్తం తడిచాయి



నేను రెండు ఎకరాల్లో వరి వేసిన. 15రోజుల క్రితం ధాన్యం సెంటర్‌కు తీసుకువచ్చిన. సెంటర్లో ఇప్పటికీ తూకం వేయడం మొదలు పెట్టలేదు. వర్షం వచ్చి వడ్లు మొత్తం తడిచాయి. మళ్లీ ఆరబెట్టాలి. కాంటాలు మొదలు పెడితే వడ్లు తడిచేవికాదు. ఇప్పటికైనా తూకం మొదలు పెట్టి రైతులకు న్యాయం చేయాలి.

– కొండవేని చంద్రమ్మ, కప్పారావుపేట, రైతు

క్లుప్తంగా

ప్రొసీడింగ్ అందజేత


ప్రొసీడింగ్ అందజేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్ సర్పంచ్ చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కొద్ది రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకొన్నాడు. కాగా ఆయన భార్యకు గురువారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రూ.5లక్షల ప్రొసీడింగ్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, అల్లూరి మహేందర్‌రెడ్డి, గూడ శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, బుజ్జన్న, రిజ్వాన్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి


మాట్లాడుతున్న గజ్జెల స్వామి

జగిత్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో రుణమాఫీ చేస్తామని, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు అమలు చేయలేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల స్వామి ఆరోపించారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. సమావేశంలో మారస్వామి, లక్ష్మీపతిగౌడ్, బొల్లిస్వామి, విజయ్‌కుమార్, కొమురయ్య ఉన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రాయికల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో గురువారం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి మాట్లాడుతూ మామిడితోట ఎకరానికి రూ.80వేలు, వరి, నువ్వులకు రూ.20వేలు, మొక్కజొన్నకు రూ.45వేల చొప్పున పరిహారం అందించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఖయ్యూంకు వినతిపత్రం అందించారు. అసెంబ్లీ బీసీ సెల్ ఇన్‌చార్జి మల్లేశ్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ఆకుల మహేశ్, కుర్మ మల్లారెడ్డి, బన్న సంజీవ్, సామల్ల సతీశ్, చంద రమేశ్, అల్లె నర్సయ్య, వేముల లక్ష్మీకాంతం, తోకల శంకర్, తిగుళ్ల గోపి, దాసరి రవి, ఎల్లాగౌడ్, రాంప్రసాద్, కట్కం కిశోర్, సుమన్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం


సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేటకు చెందిన హ్యాండ్‌బాల్ జాతీయస్థాయి క్రీడాకారిణి చెన్నవేని శ్రీవాణిని గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సన్మానించారు. శ్రీవాణి హైదరాబాద్‌లోని జెఎన్‌టీయూలో ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతోంది. గత నెలలో కేరళలో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిది. సర్పంచ్ కూన సులోచన, ఉపసర్పంచ్ పల్లె సరిత, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధులు సీహెచ్ దశరథం, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, అంబల్ల అశోక్, మారుపాక అభి, సందీప్, సీహెచ్ అజయ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

బుగ్గారం(ధర్మపురి): ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టబోయే వివిధ రకాల అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతో ఎస్సీ కాలనీల అభివృద్ధిలో భాగంగా రూ.34.92కోట్లు మంజూరైనట్లు మంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు. వీటితో పెద్దనక్కలపేట నుంచి బోదరి నక్కల చెరువుగూడెం వరకు బీటీరోడ్డు, తీగల ధర్మారం నుంచి దుబ్బయ్యపల్లె వరకు బీటీరోడ్డు, రాజారం నుంచి దుబ్బలగూడెం వరకు బీటీరోడ్డు నిర్మాణాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎస్సీ కాలనీల్లో మురుగు కాల్వలు నిర్మించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం విక్రయించాలి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిపాల్‌రెడ్డి

జగిత్యాలరూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని జగిత్యాల సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం జగిత్యాల రూరల్ మండలం హన్మాజీపేట, బాలపల్లి గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ శీలం సురేందర్, సర్పంచ్‌లు దామోదర్, భూపతిరెడ్డి, ఎంపీటీసీలు ఆరె సౌజన్య, రెడ్డి రత్న, డైరెక్టర్ బేతి రాజవ్వ, నాయకులు రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

కోరుట్లరూరల్ మండలంలో..

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్, తిమ్మయపల్లె గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఎంపీపీ తోట నారాయణ, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్‌లు తోట శారద, శివరాత్రి రాజరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ సింగిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్, ఐకేపీ ఏపీఎం శంకర్ పాల్గొన్నారు.

మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటు హర్షణీయం

జగిత్యాల: మద్దతు ధర లేక అల్లాడుతున్న మొక్కజొన్న రైతుల కోసం కేంద్రాలు ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పంట కోతల ప్రారంభంలో రూ.2500 పలికిన మద్దతు ధర రాను రాను రూ.1600కు పడిపోయిందని, రైతుల విజ్ఞప్తి మేరకు ఆదుకోవాలనే తలంపుతో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, రూ.1962 మద్దతు ధర కల్పనతో మొక్కజొన్న కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమన్నారు.

త్వరలో మొక్కజొన్న కేంద్రాలు

జగిత్యాల: త్వరలో మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయడంతో జగిత్యాలలో త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.1962 మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న సుజిత్‌రావు

మల్లాపూర్: అకాల వర్షానికి పంట నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని రాఘవపేటలో ఆయన పర్యటించి కల్లాల్లో కొట్టుకుపోయిన ధాన్యాన్ని, నేలవారిన నువ్వ పంటలను పరిశీలించారు. బాధిత రైతులు నత్తి రాము, నత్తి లక్ష్మణ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు బద్దం అశోక్‌రెడ్డి, మామిడి రాజశేఖర్‌రెడ్డి, ఎదులాపురం రమేశ్, నత్తి శేఖర్, కొక్కు హరీశ్, అడుప రమేశ్, ఆకుల నడిపిరెడ్డి, ఇప్ప లచ్చన్న, కెలేటి రమేశ్ పాల్గొన్నారు.

కొండ్ర మల్లారెడ్డి వర్ధంతి


వర్ధంతిలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

సారంగాపూర్: సారంగాపూర్ మల్లారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఇక నుంచి సారంగాపూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహిస్తామని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం సారంగాపూర్ మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కొండ్ర మల్లారెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

సారంగాపూర్: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీజేపీ నాయకులు గురువారం బీర్‌పూర్ తహసీల్దార్ శ్రీలత, సారంగాపూర్ తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతిపత్రం అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి, వరి, నువ్వ పంటలు దెబ్బతిన్నాయని, మామిడి రైతుకు ఎకరానికి రూ.80వేలు, నువ్వ ఎకరాకు రూ.30 వేలు, వరికి రూ.20వేలు పరిహారం అందించాలని కోరారు. బీజేపీ బీర్‌పూర్ మండల ఇన్‌చార్జి పడాల తిరుపతి, బీర్‌పూర్ మండల అధ్యక్షుడు మ్యాడ జనార్దన్, రెండు మండలాల నాయకులు పూరెడి రాజ్‌కుమార్, ఏలేటి రాజేశ్వర్‌రెడ్డి, ఆకుల పోచన్న, కంచర్ల నరేశ్, కంచర్ల వేణు, కరుణాకర్‌రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦రేపు మండల సర్వసభ్య సమావేశం

జగిత్యాలరూరల్: జగిత్యాల మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి అధ్యక్షతన 29న శనివారం ఉదయం 11.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శైలజరాణి తెలిపారు.

✦వార్డులో కుక్కల బెడద

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని 35వ వార్డులో కుక్కల బెడద అధికంగా ఉందని, చర్యలు తీసుకోవాలని వార్డు కౌన్సిలర్ జయశ్రీ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వార్డులో చిన్నపిల్లలు బయట ఆడుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని, కుక్కకాటుకు బలి అవుతున్నారన్నారు. అలాగే మిషన్ భగీరథ పైప్‌లైన్లు సైతం తరచూ లీకేజీ అవుతున్నాయని, మరమ్మతు చేపట్టాలని కోరారు.

✦నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయికల్: పట్టణంతో పాటు మండలంలోని అల్లీపూర్, వీరాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ హరీశ్ గురువారం తెలిపారు. 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

✦పుస్తెమెట్టెలు అందజేత

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన పేదింటి అమ్మాయి పెళ్లి సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్, చిట్టాపూర్ పీఏసీఎస్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, మెట్‌పల్లి సురక్ష హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ రమేశ్‌రెడ్డితో కలిసి పుస్తెమెట్టెలు, పెళ్లిచీర అందించారు. మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రుద్ర రాంప్రసాద్, బీఆర్ఎస్వీ నాయకులు మ్యాకల సతీశ్, నాయకులు మోర సతీశ్, ట్రస్ట్ సభ్యుడు భగత్‌తేజ పాల్గొన్నారు.

✦కంటివెలుగు శిబిరం ప్రారంభం

మల్లాపూర్: మండలంలోని హుస్సేన్‌నగర్‌లో కంటివెలుగు శిబిరాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని, సర్పంచ్ సయ్యద్ హైదర్ గురువారం ప్రారంభించారు. కంటివెలుగు ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ రాహుల్‌శర్మ, ఉపసర్పంచ్ షేక్ సాదుల్లా పాల్గొన్నారు.

✦సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని వేములకుర్తికి చెందిన వెంకటేశ్‌కు మంజూరైన రూ.24వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎంపీపీ జాజాల భీమేశ్వరి అందజేశారు. నాయకులు సున్నం సత్యం, జాజాల జగన్‌రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ రాస్తారోకో


రోడ్డుపై బైఠాయించిన కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పోలీసులతో గృహ నిర్బంధించడంపై నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు గురువారం పట్టణంలోని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కొమొరెడ్డి కరం మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజల ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న జీవన్‌రెడ్డిని ప్రభుత్వం అడ్డుకోవడం తగదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడే ప్రతిపక్ష నాయకులపై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. రాస్తారోకోతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన విరమింపజేశారు. నాయకులు కొమొరెడ్డి విజయ్‌ఆజాద్, రైసుద్దీన్, అజీం, సురభి అశోక్, అల్లూరి లింగారెడ్డి, రజాక్, బర్ల వంశీ, గోనె ప్రసాద్, మోసిన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ ప్రశాంతి

కొడిమ్యాల: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని రాంసాగర్, హిమ్మత్‌రావుపేట, చింతలపల్లి, డబ్బుతిమ్మయ్యపల్లి, తిర్మలాపూర్ కొడిమ్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పర్లపల్లి ప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ పోలు రాజేందర్, రైతుబంధు మండల అధ్యక్షుడు అంకం రాజేశం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, తిర్మలాపూర్ సింగిల్‌విండో అధ్యక్షుడు పోలు రాజేందర్, కొడిమ్యాల సింగిల్ విండో అధ్యక్షుడు మెన్నేని రాజనర్సింగరావు, సర్పంచ్‌లు నీలగిరి మాధవి, మహిపాల్, ఏలేటి మమత, రాధ, ఎంపీటీసీ డబ్బు జగన్మోహన్‌రెడ్డి, ఏపీఎం దేవరాజ్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కథలాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు పరిహారం చెల్లించాలని, మామిడితోటలకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, ఉపసర్పంచ్ లోక నర్సారెడ్డి, నాయకులు ఎగ్యారపు శ్రీహరి, కృష్ణాచారి, జవ్వాజి చౌదరి, ఆకుల సంతోష్, కుంట రాజారెడ్డి, పాల నవీన్, లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణం నిలిపివేయాలని విజ్ఞప్తి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మల్లాపూర్: మండల కేంద్రంలో రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న సహకార సంఘం గోదాం నిర్మాణాన్ని నిలిపివేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి ఎంపీవో జగదీశ్‌కి ఆమె వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి సహకార సంఘం గోదాం నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు లవంగ శివకుమార్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల రాకేశ్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి పుప్పాల మహేశ్, నాయకులు గుండా నరేందర్, బెజ్జారపు ధనుష్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్

సారంగాపూర్: ప్రతి గ్రామానికి రావాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జరిగే మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించనున్నట్లు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా తీర్మానించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన మండల కేంద్రంలో గురువారం సర్పంచ్‌లు సమావేశమయ్యారు. రానున్న ఎనిమిది నెలల్లో తమ పదవీ కాలం ముగుస్తుందని, ఇప్పటికే ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులకు సంబంధించి ఒక్కో సర్పంచ్‌కు రూ.10 లక్షల నుంచి రూ.15లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికే తాము పనులు పూర్తి చేయడానికి వడ్డీకి డబ్బులు తీసుకొచ్చి పనులపై పెట్టుబడి పెట్టడంతో పాటు, గ్రామపంచాయతీలు నిర్వహిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు వెంటనే చెల్లించాలని, లేకపోతే దీనిపై ప్రత్యేక కార్యాచరణ ఏర్పాటు చేసుకుని మూకుమ్మడిగా రాజీనామా చేయడానికి కూడా వెనుకాబోమని స్పష్టం చేశారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న శివపురాణం


అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని స్థానిక శుభమస్తు గార్డెన్స్‌లో జరుగుతున్న శివపురాణం భక్తులను ఆకట్టుకుంటోంది. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రవచనాల్లో పాల్గొంటున్నారు. శివలింగాన్ని అలంకరించి అభిషేకం చేయించారు. వేద పండితులు విష్ణుశర్మ, తీగుళ్ల, రాంచంద్రం పాల్గొన్నారు.

పిల్లలకు ఆటపాటలతో చదువు నేర్పించాలి


కథలాపూర్: సర్టిఫికెట్లు అందిస్తున్న సూపర్‌వైజర్లు

కథలాపూర్: చిన్నారులకు ఆటపాటలతో చదువు నేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, అరుణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సిరికొండలో ప్రిస్కూల్ డే వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు ప్రిస్కూల్ డే సర్టిఫికెట్లు అందించారు. సర్పంచ్ వీణ, అంగన్‌వాడీ టీచర్లు ప్రతిభ, సువర్ణ, సునంద, సోమలత పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేట అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, సర్పంచ్ జోగుల మమత, ఎంపీటీసీ తోట సుజాత, ఉపసర్పంచ్ రవి, అంగన్‌వాడీ టీచర్లు సంధ్య, జమున, పద్మ, నాయకులు రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గురువారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో తిరుమలదేవి, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, తహసీల్దార్ మహేశ్వర్, ఎంపీడీవో ప్రభు, సర్పంచ్ నేమూరి లత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రతిభ, శోభ, మండల కోఆప్షన్ సభ్యుడు చిన్నారెడ్డి, ఎంపీటీసీ రాములు, నాయకులు సత్యనారాయణ పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని చిల్వకోడూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ కందుకూరి పద్మావతి రవీందర్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ మమత, రవీందర్, ఉపసర్పంచ్ ఏశయ్య, ఎంపీటీసీ మహబూబ్, అంగన్‌వాడీ టీచర్లు విజయ, నర్మద, గంగాభవాని, సీఏలు వాణి, సులోచన పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం వార్షిక వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లత, సర్పంచ్ కొండ శ్రీలత, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, ఉపసర్పంచ్ గూడ లింగారెడ్డి పాల్గొన్నారు.

కుటుంబాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం


చిన్నారులను సన్మానిస్తున్న ప్రసాద్

మెట్‌పల్లి: పట్టణంలోని వీఆర్ఎం గార్డెన్‌లో గురువారం కుటుంబాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ పిల్లలను పెద్ద విద్యాసంస్థల్లో చదివిస్తున్నాం కానీ, వాళ్లకు మన పూర్వీకుల నుంచి వచ్చిన సభ్యత, సంస్కారం ఇవ్వలేకపోతున్నాం అని అన్నారు. చదువుతో పాటు వాళ్లకు సంస్కారం కూడా ముఖ్యమని, తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచన చేయాలన్నారు. అంతకు ముందు చిన్నారులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గుంటుక గంగాధర్, గోనె భూమయ్య, గోల్కొండ నాగరాజు, బెజ్జారపు మురళి, ఆకుతోట రమణారెడ్డి, ర్యాగల్ల మహేశ్ ఉన్నారు.